క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర



జాతర ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : మండలంలోని బంకచిన్నాయపల్లెలో ఆదివారం గంగమ్మ జాతర ఉత్సవం ఘనంగా జరిగింది. చాలా ఏళ్ల తర్వాత ఉత్సవం నిర్వహించగా ఇతర ప్రాంతాల నుంచి బంధువులు, మిత్రులు తరలి వచ్చారు. గ్రామమంతా జనంతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు బంకా లక్ష్మిరెడ్డి, కొండారెడ్డి, నరహరి, రాజేశ్‌కుమార్‌రెడ్డిల ఆహ్వానం మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డి ఉత్సవంలో పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీ జీలుగల పంపిణీ

దువ్వూరు : మొదటి విడతగా సబ్సిడీ జీలుగలు సోమవారం నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అమరనాథరెడ్డి తెలిపారు. మొదటి విడతలో చింతకుంట -1, 2, అన్నపుశాస్త్రులపల్లె, ఎం.ఎర్రబల్లి, మాచనపల్లె, గోపులాపురం, బలక్కివారిపల్లె గ్రామాలకు చెందిన రైతులకు జీలుగల విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. వరి పంట వేసే రైతులు జీలుగల విత్తనాలను చల్లుకోవాలని తెలిపారు. జీలుగల విత్తనాలు మార్కెట్ ధర కేజీ రూ.123 ఉందని, అందులో సబ్సిడీ రూ.61.50 పోతుందని రైతు వాటాగా రూ.61.50 చెల్లించి జీలుగల విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు తీసుకుని ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని కోరారు.

గణేష్ ఉత్సవాలతో సంఘటితం

మైదుకూరు : గణేష్ ఉత్సవాలతో హిందువులు సంఘటితం అవుతారని తోట్లపల్లె అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీవిరజానంద స్వామి అన్నారు. మైదుకూరులో ఆదివారం గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విరజానందస్వామి మాట్లాడుతూ స్వాతంత్య్రానికి పూర్వం బాలగంగాధర తిలక్, అంతకుముందు శివాజీ మహారాజ్ హిందువుల్లో సంఘటితం కోసం, సంస్కృతి సంప్రదాయాల కొనసాగింపు కోసం గణపతి సామూహిక నవరాత్రులను నిర్వహించారని పేర్కొన్నారు. ఆ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించేందుకు హిందువులు సంఘటితం అయ్యేందుకు గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ ప్రతిమల ఊరేగింపును సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించాలని.. ఆ విషయంలో మైదుకూరు అందరికీ ఆదర్శం కావాలని తెలిపారు. సమావేశంలో గణపతి మహోత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో ఉద్యమ విస్తరణ



ఎమ్మార్పీయస్ నాయకులతో శోభన్

పోరుమామిళ్ల: సామాజిక న్యాయం కోసం నిస్వార్థంగా పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7న జరుపుకొంటున్నట్లు మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు ఓబుళాపురం శోభన్ కుమార్ తెలిపారు. మండలంలోని ఈదుళ్లపల్లె, దమ్మన్నపల్లె, కవలకుంట్ల గ్రామాల్లో ఆదివారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎమ్మార్పీయస్ ఉద్యమ విస్తరణకు శ్రీకారం చుట్టామన్నారు. కొత్త నాయకత్వాన్ని వెలికితీసి ఉద్యమ శక్తిని పెంచి భవిష్యత్తులో కృష్ణమాదిగ కార్యాచరణను విజయవంతం చేద్దామన్నారు. యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు చురుగ్గా పాల్గొనాలని శోభన్ పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే నివాళి



నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధ

అట్లూరు : అనారోగ్యంతో మృతి చెందిన బోవిళ్ల నరసింహారెడ్డి మృత దేహానికి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టరు సుధా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆకుతోటపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోవిళ్ల నరసింహారెడ్డి(80) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆదివారం నరసింహారెడ్డి భార్య సుబ్బమ్మ, కుమార్తె వరలక్ష్మిని పరామర్శించారు. ఆమెతోపాటు మండల కన్వీనర్ ముడుమాల ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మెన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ నాగంలక్ష్మీనరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోవిళ్ల చిన్నసూరారెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, సిద్దవటం పెంచల్‌రెడ్డి, బోవిళ్ల పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుందూతీరం.. పంట సాగుకు సిద్ధం

కుందూతీర గ్రామాల్లోని రైతులు వరిసాగు చేసేందుకు కొంతమంది రైతులు మాత్రమే జీలుగ పంటను వేశారు. ఇంకో వారం, పది రోజుల్లో నారుకయ్యలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ముందుగా పచ్చిరొట్టిగా జీలుగ విత్తనాలను చల్లడంతో పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. అయితే కుందూనదిలో నీరు అరకొరగా వస్తున్నాయని, నదిలో నీరు పెరిగితే వరిపంట సాగు చేసినా ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఏదిఏమైనా పంట దిగుబడులు వచ్చాక ధర, దిగుబడి లేక గతేడాది ఈపంట సాగు చేసిన రైతులు నష్టాన్ని చవిచూశారన్నది ముమ్మాటికి నిజం. ఈఏడాదైనా ధర, దిగుబడులు బాగా రావాలని కోరుకుంటూ కోటి ఆశలతో పంటసాగు చేస్తున్నామని అక్కడి రైతులు చెబుతున్నారు.

– రాజుపాళెం



కుందూతీర పరిధిలో జీలుగను వేసిన రైతులు



వెలవలి వద్ద కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు



కుందూనది నీటిని పొలాలకు అందిస్తున్న రైతులు

వైఎస్ జగన్‌ను భూ స్థాపితం చేయడం ఎవరితరం కాదు

- గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యలు రెడ్‌బుక్ రాజ్యాంగమా..
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఆంక్షలు లేకుండా ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

దువ్వూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భూ స్థాపితం చేస్తామనడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగదని, ఇది రాజకీయ ఉన్నత విలువలను భూస్థాపితం చేయడమేనని, జగన్‌ను భూ స్థాపితం చేయడం ఎవరి తరం కాదని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్‌ఆర్‌టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకసుబ్బారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని గుడిపాడు గ్రామంలో సొసైటీ మాజీ చైర్మన్ తుమ్మల మస్తాన్ రెడ్డి ఇంటిలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ వారు వెదవ పనులు చేసినందువల్లే 11 సీట్లు వచ్చాయని చంద్రబాబు మాట్లాడటం ఆయన అహంకారానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కూటమి పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చినా, జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయన్నారు. జగన్ ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. టీడీపీకి 23 సీట్లు వచ్చినప్పుడు ఆ పార్టీ వారు వెదవ పనులు చేసినట్లు ముఖ్యమంత్రి అంగీకరిస్తారా అన్నారు. రాజమండ్రి ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి వయసుపైబడి అహంకారంతో జగన్‌ను ఉద్దేశించి.. 'నీ తల నరికొచ్చుగా' అనడం రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా మాట్లాడినట్లా అని ప్రశ్నించారు. జగన్‌కు వెంటనే బుచ్చయ్య చౌదరి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌పై కూటమి నేతలు ఇలాంటి నీచపు మాటలు మాట్లాడుతున్నారని, జగన్ ఏదైనా మాట్లాడితే తప్పుగా చిత్రీకరించి విషం చిమ్ముతున్నారని పేర్కొన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు చెప్పిన పథకాలన్నీ మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ప్రజలకు అందించారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా తల్లులకు, రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీకేటీ పట్టాలు కలిగిన వారికి కూడా అన్నదాత సుఖీభవ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల గౌరవ వేతనం రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలు, ఆశా వర్కర్లకు రూ.10 వేలు ఇస్తున్నారని, రూ.12 వేల జీతం వస్తున్నందన వారికి సంక్షేమ పథకాలు వర్తించవని చెప్పడం దారుణమన్నారు.

ప్రాణాయామం ఆయుష్షు పెంచుతుంది



యోగా గురూజీని సన్మానిస్తున్న సభ్యులు

పోరుమామిళ్ల : ప్రాణాయామం నిత్య సాధన చేయడంతో ఆయుష్షు పెరుగుతుందని యోగా గురువు గురివిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వాసవీ క్లబ్, వనితా క్లబ్ సంయుక్త సమావేశంలో యోగా గురువు గురివిరెడ్డి యోగా విశిష్టత, ప్రయోజనాలు వివరించారు. మహిళలతో యోగ సాధన చేయించారు. యోగా సాధనతో రోగాలకు దూరంగా, ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. అనంతరం గురివిరెడ్డిని శాలువా, పూలదండతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ(భీమవరం), మోటపోతుల శివ, పవన్‌కుమార్, పద్మనాభయ్య, సత్యనారాయణ, వెంకటసుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, అమ్మణ్ణి, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ 11 ఏళ్ల పాలనపై సంబరాలు



లక్ష్మీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు చిన్న గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చి 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వికసిత అమృత కాలం సేవ సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 ఏళ్లు పూర్తి సందర్భంగా ర్యాలీ చేయడం జరుగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలకు చేసిన మంచిని, దేశానికి అందిస్తున్న సుపరిపాలన గురించి ప్రజలు వివరించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బత్తల రమణయ్య, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ శకటం.. ట్రాఫిక్‌కు సంకటం



బద్వేలు శివారులో భారీ యంత్రంతో ఉన్న వాహనాన్ని నిలిపి ఉన్న దృశ్యం

బద్వేల్ అర్బన్ : బద్వేల్ మీదుగా క్రిష్ణపట్నం ఓడరేవుకు వెళ్లేందుకు ఔటర్ రింగురోడ్డు లేకపోవడంతో అనంతపురం జిల్లాలోని సిమెంటు పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు బద్వేలు నుంచే వెళ్లాల్సిన పరిస్థితి. ఆదివారం క్రిష్ణపట్నం ఓడరేవుకు 26 చక్రాల వాహనంలో బద్వేల్ మీదుగా రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారి అయినప్పటికీ.. రోడ్లు విశాలంగా లేకపోవడం, విద్యుత్ తీగలు తగినంత ఎత్తులో లేకపోవడంతో వాహనం వెళ్లేందుకు అరగంటకు పైగా సమయం పట్టింది. ఔటర్ రింగురోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రికార్డు అసిస్టెంట్‌కు సన్మానం



ఇబ్రాం సాహెబ్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం బదిలీపై వెళుతున్న రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువుల బాబు మాట్లాడుతూ ఇబ్రాం సాహెబ్ రికార్డు అసిస్టెంట్‌గా చేసినంత కాలం నిబద్ధతతో, నిజాయితీగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త జింకా సుబ్రహ్మణ్యం, అడ్వకేట్ జగన్, పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

మైదుకూరు : మండలంలోని రైతులు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బాల గంగాధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 100 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. జీలుగల పూర్తి ధర 10 కిలో ప్యాకెట్ రూ.1230 ఉండగా, సబ్సిడీ పోను రైతులు రూ.615 చెల్లించాలన్నారు. సోమవారం నుంచి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్.మైదుకూరు, ఎన్.మైదుకూరు రైతులు మండల వ్యవసాయ కార్యాలయం, అన్నలూరు, శివపురం రైతులు వారి రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, వన్ బీ జిరాక్స్, సెల్ ఫోన్ నంబర్ తీసుకెళ్లాలని వివరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్.భార్గవి

కొండాపురం : న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా వెనుకబడిన వర్గాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బార్గవి తెలిపారు. మండలంలోని ఓబన్నపేట కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన మండల న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్ రూపంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉచిత న్యాయ సహాయం, గృహ హింస చట్టం పలు చట్టాలతోపాటు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే మహిళలకు వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మైలవరంలో 108 సేవలు బంద్

జమ్మలమడుగు : మైలవరం మండలంలో 108 సేవలు నిలిచిపోయాయి. కొంతకాలంగా 108 వాహనం మరమ్మతులకు గురికావడంతో సేవలు ఆగిపోయాయి. నాలుగు రోజుల క్రితం మైలవరం నుంచి వాహనాన్ని కడపకు తరలించారు. మరమ్మతులకు ఖర్చు ఎక్కువ అవుతోందని జిల్లాస్థాయి అధికారులు పూర్తిగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మండలంలో ప్రజలకు అత్యవసర పరిస్థితులు వస్తే పెద్దముడియం లేదా జమ్మలమడుగు పట్టణంలోని 108 సర్వీసులను వాడుకోవలసి వస్తుంది. స్థానికంగా 108 సర్వీసు లేకపోవడంతో మండలవాసులకు ఇబ్బందులకు గురి అవుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకుని 108 సేవలను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

కలుషిత నీరుతాగి ఎద్దు మృతి



వేముల : మండలంలోని గొందిపల్లెలో ఆదివారం కలుషిత నీరుతాగి ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రామశేఖర్‌రెడ్డి పొలంలో సేద్యం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఎద్దులను నిలబెట్టిన సమయంలో ఎద్దు తెంచుకుని పరుగెత్తింది. దూరంగా ఉన్న కలుషిత నీరు తాగింది. అక్కడికి రైతు వెళ్లే సమయానికే ఎద్దు చనిపోయింది. ఈ సంఘటనలో ఎద్దు మృతి చెందడంతో రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

పాలకుల నిర్లక్ష్యమే ప్రొద్దుటూరుకు శాపం

- సూపర్ 6 పథకాల్లో కోతలు తగదు
- 20 రోజులు దాటినా స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కాలేదు
- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర



గాంధీ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : పాలకుల నిర్లక్ష్యమే ప్రొద్దుటూరుకు శాపమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సీపీఐ 22వ పట్టణ మహాసభల సందర్భంగా పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామకృష్ణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ పసిడిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత బెంగళూరు, చెన్నై, కువైట్‌లకు వలస వెళుతున్నారని తెలిపారు. పాలకేంద్రం, కాటన్ మిల్లులు మూతపడ్డాయని, వాటిని తెరిపించాలని కానీ, నూతన పరిశ్రమల ఏర్పాటు చేసే ఆలోచన గానీ పాలకులు ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. సూపర్ 6 పథకాల్లో తల్లికి వందనం అమలులు కోతలేంటో ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడు చెల్లిస్తారని అన్నారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల ముందుఓట్ల కోసం ఈ ప్రభుత్వం అరకొర పథకాలు విడుదల చేస్తారా అని ప్రశ్నించారు. కడప టీడీపీ మహానాడులో పది రోజుల్లో కడప ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తారని నమ్మించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 20 రోజులు దాటిని ఎందుకు పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. మాయమాటలను చెప్పి ప్రజలను మోసగించాలనుకుంటున్నారా అని అన్నారు. జిల్లా ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన తీర్పు చెప్తారని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాస్పత్రి నుండి 21 మంది ఉద్యోగ, సిబ్బంది బదిలీ అయి వెళ్లిపోయారని, తిరిగి ప్రొద్దుటూరుకు వచ్చిన వారు 8 మంది మాత్రమేనన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను దూరం చేసే కుట్ర అని అన్నారు. ప్రొద్దుటూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, సమగ్ర అభివృద్ధికై పోరాటాలకు తాము సిద్ధమవుతామన్నారు. ముందుగా పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభలో సీపీఐ పట్టణ నూతన కార్యదర్శిగా పి.సుబ్బరాయుడు, కౌన్సిల్ సభ్యులుగా జి.రామకృష్ణ, డి.శివారెడ్డి, చంద్రశేఖర్, దేవరశెట్టి నరసింహా, మచ్చ శ్రీను, హరి, ప్రమీల, సుజాత, దస్తగిరి, పీటర్, చైతన్య, మద్దిలేటి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య, మధులను ఎన్నుకోవడం జరిగింది.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయండి



మండల అధ్యక్ష, కార్యదర్శితో కలసి మాట్లాడుతున్న ఏపీ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ

చాపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయవా అని ఏపీ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఏవీ రమణ ప్రశ్నించారు. మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం ఏపీ సేవా సమితి మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మండల శాఖా అధ్యక్షులుగా ఇడగొట్టు రామాంజనేయుడు, కార్యదర్శిగా మూలే నాగేశ్వర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏవీ రమణ మాట్లాడుతూ.. జిల్లాలో ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేకుండా స్వతంత్రంగా గత మూడేళ్లుగా రైతు సేవా సమితి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఏర్పడిన ప్రభుత్వాలు ఏడాది దాటినప్పటికీ కూడా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు కే రామోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి

మైదుకూరు : ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని ఎన్ని సార్లు కోరినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జీవీ సత్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు, భూములు దక్కే వరకు పోరాటాలు చేయాలనే అంశంపై సీపీఐ రూరల్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా పేదలు పేదలుగానే ఉంటూ, పేదలుగానే మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల దాచుకోవడానికి 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా స్పందించడం లేదన్నారు. బలవంతులు ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తుంటే ప్రభుత్వాలు, అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పేద ప్రజలు కూడా భూ పోరాటాలకు సిద్ధమై ఇంటి స్థలాలు, భూములను సాధించుకోవాలని అన్నారు. మహాసభలో సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి పి.శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, షావలి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. వినాయకనగర్‌లోని దేవాంగ కల్యాణమండపంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని 10వ తరగతి, ఇంటర్‌లో రాణించిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించడం అభినందనీయమన్నారు. ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ నందవరంలో రూ.50 లక్షల తో 40 సెంట్ల స్థలం కొనుగోలు చేసి దేవాంగ సత్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం 10, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5000, ద్వితీయ బహుమతిగా రూ.4000, తృతీయ బహుమతిగా రూ.3000 అందించి ప్రశంశాపత్రం అందించి సత్కరించారు. మొత్తం 66 మంది విద్యార్థులకు రూ.1.62లక్షలను అందించారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటి చైర్మన్ డాక్టర్ జాగాబత్తిన శివప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు చంద్రశేఖర్, నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మన్నెం సతీష్, ఏపీఐఐసీ సజ్జ వెంకటసురేష్, ఇస్రో విశ్రాంత ఇంజనీర్ కుమారస్వామి, దేవాంగ అభ్యుదయం సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.